క్లుప్తంగా

22న జాబ్ మేళా



జాబ్‌మేళా పోస్టర్లను విడుదల చేస్తున్న అధ్యాపకులు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 22వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి భాయి తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీశైలం నియోజకవర్గంలోని నిరుద్యోగులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, నాలుగు కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాకు హాజరవుతున్నారన్నారు. ఉద్యోగాలకు ఎంపికయ్యే వారికి రూ.16 వేల నుంచి రూ.20 వేల వేతనం లభిస్తుందని తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పంట నష్టంపై నివేదికలు తయారు చేస్తాం



బొల్లవరం వద్ద నేలకొరిగిన వరిపైరును పరిశీలిస్తున్న ఏఓ

మహానంది: అల్పపీడన ప్రభావంతో నష్టపోయిన పంట పొలాలను పరిశీలిస్తున్నామని, నష్టం జరిగి ఉంటే ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. బొల్లవరం, తమ్మడపల్లె, నందిపల్లె గ్రామాల పరిధిలో నేలకొరిగిన వరిపైర్లను శనివారం ఆయన పరిశీలించారు. ఏయే పంటలు, ఎంత విస్తీర్ణంలో నష్టపోయాయన్న అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు రూపొందిస్తామని చెప్పారు. నేలకొరిగిన పైరును కాపాడుకునేందుకు పలు సూచనలు చేశారు.

అన్నా క్యాంటీన్ ప్రారంభం

ఆత్మకూరు: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్యాంటీన్‌లో కేవలం రూ.5 కే రెండు పూటలా భోజనం, ఉదయం టిఫిన్ లభిస్తుందన్నారు. పేదలు, రైతులు, ఆస్పత్రుల వచ్చే రోగుల బంధువులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఆహారంలో నాణ్యత లోపిస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కోఆప్షన్ సభ్యుడు ఎం.ఎ.రషీద్, న్యాయవాది గోవిందరెడ్డి, గౌస్, శివప్రసాద్‌రెడ్డి, వేణు, శ్రీనాథ్, కౌన్సిలర్లు పార్వతి, రంగస్వామి పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానంది: మహానందీశ్వరుడిని ఏపీఈఆర్‌సీ ఫైనాన్స్ మెంబర్ వెంకట రామారెడ్డి, కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. శనివారం మహానందికి వచ్చిన ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, విద్యుత్‌శాఖ ఏఈ ప్రభాకర్‌రెడ్డి స్వాగతం పలికారు. కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం స్థానిక అలంకార మండపంలో వేదపండితులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

సంగమేశ్వరంలో పూజలు

కొత్తపల్లి: మండలంలోని సప్తనది సంగమేశ్వరం వద్ద ఉన్న ఎగువ పుష్కరఘాట్ ఉమామహేశ్వరాలయంలో శనివారం స్వామి, అమ్మవార్లకు భక్తులు పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్రం బాలాపూర్ నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి కృష్ణాజలాలతో అభిషేకం చేశారు. కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతీ వంటి విశేష పూజలు చేసుకున్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

వెలుగోడు: గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా నియోజకవర్గంలో రూ. 20 కోట్లతో అభివద్ధి పనులు చేస్తున్నామని.. వెలుగోడు మండలంలో రూ.2.25 కోట్లతో వివిధ పనులు చేస్తున్నామని చెప్పారు. శనివారం మండలంలోని తిమ్మనపల్లె, బోయరేవుల, వెలుగోడు, గుంతకందాల గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, ఏపీడీ అన్వర్‌బేగం, నాయకులు అన్నారపు శేషిరెడ్డి, రఘుస్వామి రెడ్డి, రామానాయుడు, సుధాకర్‌రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, సర్పంచ్ పెద్ద సామన్న తదితరులు పాల్గొన్నారు.

నల్లమలలో ట్రాఫిక్ జామ్



రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో శనివారం వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. రెండు నెలల క్రితం ఓ బోర్‌వెల్స్ లారీ లోయలో పడింది. దాన్ని బయటకు తీసేందుకు తెచ్చిన రెండు భారీ క్రేన్ల వల్ల కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. లారీని బయటికి తీసిన అనంతరం రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

మొక్కజొన్న వర్షార్పణం !

- తడిసిముద్దయిన మొక్కజొన్న దిగుబడులు
- విత్తనాలు మొలకెత్తిన వైనం
- చేతివాటం చూపుతున్న దళారులు
- రైతన్నకు తప్పని ఆవేదన



వర్షం పడుతుండడంతో ధాన్యంపై పట్టలు కప్పుకున్న రైతులు



మొలకెత్తిన మొక్కజొన్న ధాన్యం



వర్షంలో తడిచిన మొక్కజొన్న ధాన్యంవద్ద విలపిస్తున్న రైతు (ఫైల్)

కొత్తపల్లి: వర్షాభావ పరిస్థితులు అన్నదాతను వెంటాడుతూనే ఉన్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా నాలుగు రోజులుగా కురుస్తున్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రైతన్న తీవ్రంగా నష్టపోయాడు. ప్రత్యేకించి మొక్కజొన్న వర్షార్పణం అయ్యింది. తుపాన్ దెబ్బకు మొక్కజొన్న దిగుబడులు తడిసి ముద్దయ్యాయి. ఈ నష్టం కొత్తపల్లి మండలంలో మరీ ఎక్కువగా జరిగింది. మండలంలో ప్రధానంగా మొక్కజొన్న, మినుము, వరి పంటలు సాగు అవుతాయి. మండలం మొత్తం 12 గ్రామ పంచాయతీలలో సాగు విస్తీర్ణం తొమ్మిదివేల హెక్టార్లు ఉండగా మొక్కజొన్న సాగు ఏకంగా ఐదువేల హెక్టార్లలో సాగు చేశారు రైతులు. కొన్నిప్రాంతాల్లో మినహా చాలా వరకు దిగుబడులు ఆశాజనకంగానే వచ్చాయి. పంటలు చేతికి రావడంతో కోతలు పూర్తి చేసిన మొక్కజొన్న రైతులు దిగుబడులను ఆరబోసుకున్నారు. రేపోమాపో ధాన్యాన్ని విక్రయించాల్సి ఉంది. కొందరు రైతులు వ్యాపారులతో ధర మాట్లాడుకున్నారు కూడా. ఇంతలోనే తుపాన్ మొక్కజొన్న రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. జోరుగా కురుస్తున్న వర్షాలకు దిగుబడులను కాపాడుకోలేని పరిస్థితి. దీంతో మొక్కజొన్న గింజలు తడిసిపోయి ముద్దయ్యాయి. దిగుబడుల రాసుల్లో కొంతమేర గింజలు మొలకెత్తగా మరికొంత ధాన్యం నల్లబడింది. దీంతో రైతులు కన్నీరే మిగిలింది.

నల్లబడిన గింజలు...
బేరమాడుతున్న దళారులు

కొత్తపల్లి మండలంలో మొక్కజొన్నను విస్తారంగా సాగు చేస్తారు. ఈయేడు ఏకంగా ఐదువేల హెక్టార్లలో ఈ పంట సాగవ్వగా నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏకంగా మూడువేల హెక్టార్లకుపైగానే నష్టం వాటిల్లినట్లు అధికారుల అంచనా. వాస్తవానికి ఇంకా ఎక్కువ హెక్టార్లలోనే నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు. దాదాపు 70 వేల క్వింటాళ్లు అమ్ముడుపోక ఎక్కడ ఉన్న దాన్యం అక్కడే టార్పలిన్ పట్టలకింద మగ్గిపోతుంది. గింజలు నల్లబడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన గింజలను ఆరబెట్టుకునేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.2300 ఉంది. తుపాన్ రాకముందు ఇదే ధరకు కొనుగోలు చేస్తామన్న వ్యాపారులు, దళారులు ఇప్పుడు మాటమార్చేశారు. చేతివాటం చూపుతున్నారు. గింజలు నల్లబడినందును రూ. 1,800 మించి కొనుగోలు చేయాలమంటూ నిర్మోహమాటంగా చెప్పేస్తున్నారు వ్యాపారుల. దీంతో రైతన్న అయోమయానికి గురువుతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



నేను రెండెకరాలలో మొక్కజొన్న సాగు చేశా. వర్షం రాకముందే కోతకోసుకొని ఆరబోసుకున్నా. అంతలోనే అకాల వర్షం ముంచేసింది. ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. దీంతో కొంత శాతం మొలకలు వచ్చాయి. దీంతో మొత్తం పంటను దళారులు కొనమంటున్నారు. ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో ఉన్నాం. మొక్కజొన్న దిగుబడులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకుంటే బాగుంటుంది.
– పరమేష్, రైతు, ఎదురుపాడు గ్రామం

తక్కువ ధరకు కూడా కొనడం లేదు



నేను పదెకరాలు సొంత పొలంతోపాటు మరోపదెకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేశా. ఇందులో పదిఎకరాలు కోతకోసుకొని ఆరబెట్టుకున్నా. వర్షంలో తడవడంతో ధాన్యం రంగుమారింది. అక్కడక్కడ మొలకలు కూడా వచ్చాయి. కేవలం ఆరబెట్టుకొనేందుకు రూ.30 వేల వరకు ఖర్చుచేశా. తక్కువ ధరకు అమ్ముదామన్నా వ్యాపారులు ముందుకు రావడం లేదు. అయోమయంగా ఉంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.
– ఎం.మున్వర్ అలీ, రైతు దుద్యాల గ్రామం

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



నేను 12 ఎకరాలు సొంతపొలంతోపాటు మరో ఎనిమిదెకరాలు గుత్తకు సాగు చేస్తున్నా. మొక్కజొన్న పంటను కోతకోసుకున్న సమయంలో కురిసిన వర్షంతో పంటలు దెబ్బతిన్నాయి. సాగు కోసం దాదాపు రూ.3లక్షల వరకు ఖర్చు అయ్యింది. ఖర్చులు కూడా వస్తాయో లేదో అని భయమేస్తుంది. దెబ్బతిన్న మొక్కజొన్నను కొనేందుకు ఎవ్వరు ముందుకు రాకపోవడంతో ధాన్యం అలానే ఉంది. ఇంకా వర్షం వస్తుందని అంటున్నారు. త్వరగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.
–రామకృష్ణుడు, రైతు, గోకవరం గ్రామం

వసతి గృహాల తనిఖీ



వార్డెన్‌లకు సూచనలు చేస్తున్న జడ్జి వెంకటేశ్వరరావు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు, కొత్తపల్లెలోని విద్యార్థుల వసతి గృహాలను ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవా సంస్థ చైర్మన్ వెంకటేశ్వరరావు శనివారం సందర్శించారు. తొలుత కొత్తపల్లె బీసీ హాస్టల్‌ను పరిశీలించారు. అనంతరం ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని బీసీ బాలుర, బాలికల హాస్టళ్లలో తనిఖీలు చేశారు. వసతి సౌకర్యాలు, శుచి, శుభ్రత, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట కోర్టు సిబ్బంది, పోలీసులు ఉన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వార్డు మెంబర్లు, ఉప సర్పంచ్‌లకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఎంపీడీఓ సుమిత్రమ్మ మాట్లాడుతూ వార్డు సభ్యులు గ్రామసభలకు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. ఈ గ్రామ సభల్లో గ్రామాభ్యుదయానికి ఉపయోగపడే పనులు చేపట్టేందుకు తీర్మానాలు చేసి మినిట్స్ పుస్తకంలో సంతకాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రారెడ్డి, కోట్ల వెంకటేశ్వర్లు, కాసీం సాహెబ్, శేత్య తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రెండు రోజులు నిర్వహించిన గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ దశరథరామయ్య మాట్లాడుతూ శిక్షణలో తెలిపిన అంశాలను గ్రామ పంచాయతీల్లో అమలు చేయడంతపాటు గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సంజన్న, ట్రైనర్స్ వీరారెడ్డి, పవన్, అనురాధ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



గిరిజనులను ఉద్దేశించి మాట్లాడుతున్న రవికుమార్

కొత్తపల్లి: చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని టీబీ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్ సూచించారు. మండలంలోని పాలెంచెరువు గిరిజనగూడెం ఆశ్రమ పాఠశాలలో శనివారం టీబీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడీ, సిగరెట్, గుట్కా, మద్యం తదితర వ్యవసనాలకు బానిసలు కాకుడదన్నారు. వీటితో టీబీ వ్యాధిబారిన పడే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శైలజ, హెల్త్ అసిస్టెంట్ సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పల్లె పండుగలో తెలుగు తమ్ముళ్ల అలకలు

కొత్తపల్లి:మండలంలోని ఆయా గ్రామాలలో అధికారులు టీడీపీ నాయకులతో కలసి పల్లెపండుగ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. అయితే ఇందులో నాయకులు రెండు వర్గాలుగా చీలిపోతున్నారు. ఓ వర్గం హాజరు అయితే మరోవర్గం గైర్హాజరవుతూ అలకలు బూనుతున్నారు. దీంతో పార్టీ చీలికలు ఎంతవరకు దారి తీస్తాయోనని ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. శనివారం పెద్దగుమ్మడాపురంలో పల్లెపండుగ కార్యక్రమాన్ని అధికారులు, టీడీపీ నాయకులు కలసికట్టుగా నిర్వహించారు. అయితే అక్కడున్న మరోవర్గం హాజరు కాలేదు. మొదటి నుంచి ఎంతో శ్రమించిన మమ్మల్ని వదిలి ఎన్నికలు అయిపోయిన తర్వాత వచ్చిన వారికి పదవులు, ప్రాధాన్యతలు ఇస్తున్నారని ఓ వర్గం నాయకులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. త్వరలో నంద్యాలకు రానున్న ఇన్‌చార్జ్ మినిస్టర్ పయ్యావుల కేశవ్‌ను కలసి పార్టీని నమ్ముకున్న వారికి న్యాయం చేయాలని కోరేందుకు సన్నద్ధం అవుతున్నట్లు గ్రామంలో ప్రజలు చర్చించుకుంటున్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

నందికొట్కూరు: నిరుద్యోగ యువతి యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెండి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ నైపుణ్యాభి వృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నందికొట్కూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 25 జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రెడిట్ అక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్, నవభారత్ ఫర్టిలైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పదవ తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, పీజీ నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సువర్ణమయంగా నల్లమల



బంగారు వర్ణంలో కనిపిస్తున్న నల్లమల అడవి

మహానంది: మహానందానికి నిలయమైన మహానంది ఆలయ అందాలు నిత్యం ఓ కొత్తదనంగా అగుపిస్తాయి. ఆలయం వెనుక ఉన్న నల్లమల అడవి పచ్చటి అందాలు మరింత ఆకర్షణనిస్తాయి. దట్టమైన చెట్లతో పచ్చగా కళకళలాడే నల్లమల అడవి ఒక్కసారిగా ఎరుపెక్కి బంగారు వర్ణంలో శనివారం ఇలా కనిపించింది.

22 నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

పాములపాడు: అక్టోబర్ 22వ తేదీ నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ శనివారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని సచివాయాలు, కాలేజీలు, పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో 4 రోజుల పాటు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక క్యాంపులో కొత్త ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్, డెమో గ్రాఫిక్ అప్‌డేట్, ఈ–ఆధార్ తదితర సేవలు అందించనున్నట్లు వివరించారు.

వివాదాస్పద స్థలం పరిశీలన

మహానంది: స్థానిక ఈశ్వర్‌నగర్ కాలనీలోని శ్రీకాశినాయన ఆశ్రమం వద్ద కొద్ది రోజుల నుంచి వివాదంలో ఉన్న స్థలాన్ని శనివారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈ మేరకు శనివారం ఆర్‌ఐ సుబ్బారావు, వీఆర్వో చలమయ్య స్థలం వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. అక్కడ నాగులకట్ట ఉందని, ఇటీవల అయ్యన్ననగర్‌కు చెందిన ఒకరు స్థలం తనదంటూ వచ్చారని చెప్పారు. రికార్డులు పరిశీలించి నివేదికలు ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆర్‌ఐ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

మిడుతూరు: మండల కేంద్రమైన మిడుతూరు గ్రామ శివారులో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఓబులేసు తెలిపారు. నందికొట్కూరు పట్టణానికి చెందిన దూదేకుల మౌలాలి ఏపీ 39వీఈ2502 నంబరు ఆటోలో 450 కిలోలు(9ప్యాకెట్లు) తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి ఆటో సీజ్ చేసినట్లు ఆయన వెల్లడించారు.

22 నుంచి ఆధార్ స్పెషల్ డ్రైవ్

మహానంది: మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 22వ తేదీ నుంచి ఆధార్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మహబూబ్‌దౌలా తెలిపారు. 22, 23వ తేదీల్లో గాజులపల్లె సచివాలయాల పరిధిలో, 24న తిమ్మాపురం, 25న బుక్కాపురం సచివాలయాల వద్ద ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లాస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు

కొత్తపల్లి: జిల్లాస్థాయి క్రీడాపోటీలకు స్థానిక కేజీబీవీ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎంపిక అయ్యా రు. కర్నూలు డీఎస్‌ఏలో ఈనెల 22న జరిగే జిల్లాస్థాయి పోటీకు అండర్ 17,14 కబడ్డీ విభాగంలో ఆరుగురు, ఖోఖో విభాగంలో నలుగురు విద్యార్థిను లు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కృష్ణాబాయి చెప్పా రు. ఈ మేరకు శనివారం విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

నందికొట్కూరు: సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ రాములు నాయక్ సూచించారు. శనివారం మండలంలోని వడ్డెమాను గ్రామానికి చెందిన వైవీ రమణారెడ్డి ఇంటికి 3 కేవీ సోలార్ సిస్టమ్ నెట్‌మీటర్‌ను కీర్తి సోలార్ పవర్ సంస్థ ఆధ్వర్యంలో అమర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సామాగ్రి ధర రూ.2,20,000 ఉండగా ఉచితంగా విద్యుత్ పథకం కింద రూ.78వేలు రాయితీ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సోలార్ సంస్థ జేఎల్ఎం తిరుపాలు, సూర్యచంద్ర, జనార్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో మోస్తరు వర్షం

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా శనివారం మోస్తరు వర్షం కురిసింది. 4.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. రైతులు సాగుచేసిన మినుము, పొగాకు, వరి పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే మొక్కజొన్న రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వర్షాలు కొనసాగుతుండడంతో పంటలన్నీ దెబ్బతినే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కార్యకర్తలకు అన్నివేళలా అండగా ఉంటా



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆ పార్టీ శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలు అధైర్యపడొద్దని త్వరలో మంచి రోజులు వస్తాయని తెలిపారు. ఇప్పటికే టీడీపీ కూటమిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఏ సమస్య ఉన్నా తోడుంటానని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో కార్యకర్తలకు ఏ సాయం కావాలన్నా తాను ముందుంటానని చెప్పారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. కష్టకాలంలో పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు పెద్ద పీట వేస్తామన్నారు. పార్టీ పట్టణాధ్యక్షుడు సయ్యద్‌మీర్ కుమారుడు రషీద్ వివాహానికి హాజరవుతానని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు సయ్యద్ మీర్, మండలాధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి, నాయకులు వెంకటస్వామిగౌడ్, బాలస్వామియాదవ్, నాగరాజు, రాజు, మౌలాలి, లింగస్వామి, కలిముల్లా, బత్తులస్వామి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రామాంజనేయ నాయక్

పగిడ్యాల: పశుసంవర్ధక శాఖ నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జూపాడు బంగ్లా డివిజన్ సహాయ సంచాలకులు రామాంజనేయ నాయక్ ఆదేశించారు. శనివారం పాత ముచ్చుమర్రి పశుసంవర్ధక శాఖ ఉప గణాభివృద్ధి కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని, ఆ దిశగా రైతులకు అవగాహన కల్పించాలని పశువుల డాక్టర్‌కు సూచించారు. ప్రతి ఏటా పశువుల గణన చేపట్టి డేటాను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. గొర్రెల పెంపకం దారులతో జీవాలకు ఇన్సూరెన్స్ చేయించేలా చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ రాగసంధ్య, వీఎల్‌ఓ శ్రీనివాసులు, వీఏ వీరేష్, ఏహెచ్‌ఏ చరిత తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

పాములపాడు: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శనివారం పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని యర్రగూడూరు, బానుముక్కల గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా తాగు నీటి సమస్య పరిష్కరించాలని యర్రగూడూరు మహిళలు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తొగురు సరోజినీ వర్జినియ, సర్పంచు మంగమ్మబాయి, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ దర్గాబాయి, మాజీ సింగిల్ విండో చైర్మన్ హరిసర్వోత్తమరావు, మాజీ సర్పంచు హరినాథరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వదలని వాన...రైతులకు తప్పని కష్టాలు

పాములపాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలకు తిప్పలు తప్పడం లేదు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలుమార్లు వాన కురిసింది. దీంతో ఆరుబయట ప్రాంతాల్లో మొక్కజొన్న ధాన్యం ఆరబోసిన రైతులు పరిస్థితి దయనీయంగా మారింది. ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు పడరానిపాట్లు పడ్డారు.

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వాన దంచికొట్టింది. లింగాపురం, గోకవరం, ఎదు రుపాడు, దుద్యాల, నందికుంట గ్రామాలలో చిరుజల్లులు పడ్డాయి. అదేవిధంగా పాలెంచెరువుగూడెం, బండినాయిని పాలెం, గువ్వలకుంట్ల, వీరాపురం, బావాపురం గ్రామాలతో పాటు కొత్తపల్లి మండల కేంద్రంలో మోస్తారు వర్షం కురిసింది. వరిపైరు నేలవాగా మొక్కజొన్న రైతులు ఎంతో ఇబ్బంది పడ్డారు.

బండిఆత్మకూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మండల వ్యాప్తంగా రైతన్నకి కన్నీరు మిగిల్చింది. మండలంలోని కొన్ని గ్రామాల్లో కోత దశలో ఉన్న వరి పంట నేల పాలవగా, అధిక వర్షం పడటం వలన కిందపడిన వరి పంటను కట్టలు కట్టేందుకు కూడా పనికి రాకుండా పోతుంది. మరికొన్ని గ్రామాల్లో ఆరుతడి పంటలు పూర్తిగా చేతికి రాకుండా పోయాయి.